నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
1
గురువారం 17 ఆగస్టు 2023

కాంగ్రెస్ మైనారిటీ మండల అధ్యక్షునిగా మజీద్ నియామకం

నవతెలంగాణ-వేల్పూర్

నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం అక్లూర్ గ్రామానికి చెందిన మజీద్ కాంగ్రెస్ పార్టీ మండల మైనారిటీ అధ్యక్షునిగా నియమకం పొందారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం నందు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మనాలా మోహన్ రెడ్డి చేతుల మీదుగా నియమక పత్రం అందుకున్నట్టు పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మైనార్టీ అధ్యక్షుడు మజీద్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో మండల మైనార్టీ అధ్యక్షులుగా నియమించినందుకు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. టీపిసిసి రేవంత్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలోమండల అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు నీరడి భాగ్య, సెక్రెటరీ దామోదర్ గౌడ్, మండల మహిళా అధ్యక్షురాలు స్వరూప గౌడ్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

ఎన్నికల ముందు..
ప్రతిపక్షాలవి కుప్పిగంతులు

- ప్రజలను ఆగంపట్టిస్తున్నాయి
- మనది పేగు బంధం.. వారిది ఓటు బంధం
- సీనియారిటీకి- సిన్సియారిటీకి మధ్య ఎన్నికలు
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత


ఎన్నికల ప్రచార నగారాను మోగిస్తున్న కవిత

వివరాలు మెయిన్‌లో..

హక్కుల సాధనకు పోరాడాల్సిన సమయం ఆసన్నమైంది

- బీసీల్లో ఐక్యతతోనే రాజ్యాధికారం సాధ్యం
- కాంగ్రెస్‌తోనే బడుగు బలహీన సంక్షేమం
- బీసీ డిక్లరేషన్ కమిటీ చైర్మన్ వి.హనుమంతరావు


మాట్లాడుతున్న వీహెచ్

నవతెలంగాణ-నిజామాబాద్

కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలోనే బీసీలకు రాజ్యాధికారం దక్కు తుందని, బీసీలకు న్యాయం జరుగుతుందని బీసీ డిక్లరేష న్ కమిటీ చైర్మన్, మాజీ పిసిసి అధ్యక్షులు మాజీ ఎంపీ, వి.హెచ్ హనుమంతరావు అన్నారు. ఐక్యతతోనే ఏదైనా సాధించుకోవచ్చని తెలంగాణ రాష్ట్రంలోని బీసీలందరూ ఏకతాటిపై వచ్చి తమ హక్కులను సాధించుకోవాలంటే పోరాడాల్సిన సమయం ఆసన్నమైనదని పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ప్రగతినగర్‌లో గల మున్నూరు కాపు కళ్యాణ మండపంలో బీసీ గర్జన సన్నాహక సమావేశానికి వి.హెచ్. ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారతదే శంలో మోడీ తనకు తాను ఓబీసీ అని అనుకుంటున్నాడనీ అన్నారు. దేశంలో 56 శాతం బీసీలు ఉంటే బీసీలకు ఎలాంటి న్యాయం జరగలేదని వాపోయారు. రాహుల్ గాంధీ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాద యాత్ర చేసి ఓబిసిల సమస్యలు తెలుసు కున్నారనీ అన్నారు. బడుగు బలహీన వర్గాల కోసం ఆలోచించే పార్టీ అంటే కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీలు బీసీల సంక్షేమ కోసం కృషి చేశారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలను కేసీఆర్ దళిత బంధు పేరుమీద మోసం చేస్తున్నారని ఆరోపిం చారు.

ఎంతో మంది తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రాణాలు త్యాగం చేస్తున్నారని సోనియాగాంధీ పెద్ద మనసు చేసుకొని తెలంగాణను ఇచ్చిం దని పేర్కొన్నారు. ఇచ్చిన మాట నిలబట్టుకోవడం అంటే కాంగ్రెస్ పార్టీ దే అని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలా అబద్ధాల మాటలు చెప్పమని అన్నారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువస్తేనే బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని దీమా వ్యక్తం చేశారు. అనంతరం సామాజిక న్యాయం కోసం తెలంగాణ ఏర్పాటు కోసం పోరాడిన గద్దర్ ఆత్మ శాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, పిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్, మాజీ విప్ ఈరవత్రి అనిల్, రూరల్ ఇన్‌చార్జి భూపతిరెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షులు తాహేర్ బీన్ హందాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగా ధర్ ,పిసిసి ప్రధాన కార్యదర్శి నగేష్‌రెడ్డి నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కేశ వేణు ,మాజీ ఎమ్మెల్సీ అరికేల నర్సా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి

- కొత్తగా రిక్రూట్‌మెంట్‌కోసం ఇచ్చిన నోటిఫికేషన్ రద్దు చేయాలి
- సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె ప్రారంభం



నిజామాబాద్‌లో సమ్మెశిబిరంలో నినాదాలు చేస్తున్న ఏఎన్ఎంలు, సీఐటీయూ నాయకులు... కామారెడ్డిలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

వతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)/కంఠేశ్వర్

కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని, కొత్తగా రిక్రూట్‌మెంట్ కోసం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. తమను రెగ్యూలర్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆశాలు సీఐటీయూ ఆధ్వర్యంలో కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో సమ్మె ప్రారంభించారు.

కామారెడ్డి జిల్లా కేంద్రంలో సమ్మెను సీఐటీయూ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎన్ఎంలను గత 20 సంవత్సరాల నుండి పనిచేస్తున్న ఏఎన్ఎంలను పర్మిట్ చేయకుండా 1520 ఎంపిహెచ్ఏ పోస్టుల భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇవ్వడం విడ్డూరమని అన్నారు. వీరికి మార్కుల్లో 20 శాతం వెయిటేజీ ఇస్తామని ప్రకటించారని, కానీ వీరంతా గతంలో డిఎస్సి ద్వారా రోల్ ఆఫ్ రిజర్వేషన్ రోస్టర్ మెరిట్ ప్రకారం ఎంపికై పనిచేస్తున్నారని గుర్తు చేశారు. వీరితో మళ్లీ పరీక్ష రాయిస్తామనడం న్యాయం కాదని, ఇప్పటికే చాలా మంది సీనియర్లు అయ్యారని అన్నారు. వారిని ఖాళీగా ఉన్న పోస్టుల్లో సీనియార్టీ ప్రకారం భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌లు పరిష్కరించే వరకూ సమ్మె విరమించబోమని స్పష్టంచేశారు. వీరి సమ్మెకు వివిధ ప్రజా సంఘాల నాయకులు నాయకులు రాజనర్సు, కొత్త నర్సింలు, ఎమ్‌డీ మహబూబాబాద్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు లక్ష్మి, దీవెన, కవిత, రజిత, లక్ష్మి, రేణుక పాల్గొన్నారు.

కంఠేశ్వర్ : నిజామాబాద్ ధర్నా చౌక్ వద్ద ఏఎన్ఎంల సమ్మెను సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 16-20 ఏండ్ల నుంచి సెకండ్ ఏఎన్ఎంలు గ్రామాల్లో పనిచేస్తున్నా నేటికీ పర్మినెంట్ చేయకపోవడం చాలా దుర్మార్గమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ప్రతి నెలలో అన్ని రకాల పనులు చేయిస్తూ కేసీఆర్ కిట్టు, ఆన్‌లైన్‌లో, ఐహెచ్ఐపి, డబ్ల్యూ హెచ్ సి అబాకర్స్ లాంటి 32 రకాల రికార్డులను ఆన్‌లైన్ చేయిస్తూ 24 గంటల పాటు పని చేయిస్తుందని దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ పథకం ప్రవేశపెట్టినా గ్రామస్థాయిలో అనేక ఇబ్బందులను ఓర్చుకొని రాష్ట్ర ప్రభుత్వానికి పేరు తెస్తూ కరోనా కష్టకాలంలో కూడా రెండు సంవత్సరాలు కష్టపడి ప్రాణాలకు తెగించి పనిచేసినా ప్రభుత్వం గుర్తించకపోవడం దుర్మార్గమని అన్నారు. వారి శ్రమను గుర్తించకుండా వారిని పర్మినెంట్ చేయకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. గ్రామాల్లో వ్యాక్సినేషన్, ఎన్‌సిడి, పిఎన్‌సిల విజిట్, టిబి కేసులు, లెప్రసీ ప్రతి నెల 100 శాతం కావాలని పై అధికారులు ఏఎన్ఎం పై ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. ఇన్ని ఇబ్బందులను ఎదుర్కొని పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేయకపోవడం చాలా బాధాకరమైన విషయం అని అన్నారు. తక్షణమే వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను పర్మినెంట్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. పండగ, వారంతా సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు పుష్ప, కవిత, ధన, స్వర్ణ, సరోజ, లలిత, విక్టోరియా, సుశీల, ఇంద్ర లక్ష్మీ, గంగామణి, విజయ, రేణుక, జ్యోతి, అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

జాతీయభావం పెంపొందేలా
గాంధీ చిత్ర ప్రదర్శన

కలెక్టర్ జితేశ్ వి పాటిల్


గాంధీ సినిమాను తిలకిస్తున్న విద్యార్థులు.. పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

భారత స్వాతంత్ర్య వజ్రోత్సవ ముగింపు ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులలో జాతీయ భావం పెంపొందించేలా ఉచితంగా గాంధీ చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేసిందని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ తెలిపారు. జిల్లాలోని 9 సినిమా హాళ్లలో ఉచితంగా ప్రదర్శిస్తున్న గాంధీ చలన చిత్రాన్ని బుధవారం 25 పాఠశాలలకు చెందిన 5,074 మంది విద్యార్థులు తిలకించారని తెలిపారు.

ఈ నెల 14 నుంచి 24 వరకు (9) ప్రభుత్వ పని దినాలలో చిత్ర ప్రదర్శన చేపడుతున్నట్టు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు చిత్ర ప్రదర్శన ఉంటుందని చెప్పారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ (9) సినిమా హాళ్లలో సీటింగ్ కెపాసిటీ మేరకు విద్యార్థులు చిత్రాన్ని తిలకించుటకు పాఠశాలల వారీగా షెడ్యూల్ రూపొందించారని అన్నారు. రవాణా, రెవెన్యూ, పోలీసు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో విజయవంతంగా చిత్ర ప్రదర్శనకు ఏర్పాట్లు చేశామని కలెక్టర్ తెలిపారు. కామారెడ్డిలోని ప్రియ 70ఎంఎం, ప్రియ 35 ఎంఎం, దర్శన్, శాంతి థియేటర్లలో, బాన్సువాడలో మహేశ్వరి, వెంక టేశ్వర, బిచ్కుందలోని పరమేశ్వరి, పిట్లం లోని శ్రీ వెంకటేశ్వర, నాగిరెడ్డిపేటలోని రామ్ ప్రతాప్ థియేటర్లలో చిత్ర ప్రదర్శన జరుగుతుందని కలెక్టర్ చెప్పారు. బుధవారం దర్శన్, ప్రియ 70 ఎంఎంలో మండల విద్యాధికారి ఎల్లయ్య, విద్యార్థులతో గాంధీ చిత్రాన్ని వీక్షించారు.

ఇండ్ల స్థలాలు ఇవ్వాలంటే..
కేసులు పెడతారా..?

- సీపీఐ(ఎం) నాయకులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి
- పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ.. ఏసీబీకి వినతి



ర్యాలీగా వెళ్తున్న సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

పేదలు నివసించేందుకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ పోరాటం చేసినందుకు సీపీఐ(ఎం) నాయకులపై కేసులు పెడతారా అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు ప్రశ్నించారు. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) నిజామాబాద్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో గల దుబ్బ ప్రాంతంలోని సర్వే నెంబర్ 171 లోని ప్రభుత్వ స్థలంలో నాలుగు నెలలుగా ఉండడానికి ఇల్లు లేని పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని గుడిసెలు వేసి పోరాటాన్ని కొనసాగిస్తున్న సందర్భంలో సీపీఐ(ఎం) నాయకులపై ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఫిర్యాదు చేయగా పోలీసులు అతి ఉత్సాహంతో కేసులు పెట్టడాన్ని ఖండిస్తున్నట్టు తెలిపారు. బుధవారం పార్టీ కార్యాలయం నుంచి ఆర్డీవో, ఏసీపీ కార్యాలయాలకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేశారు.

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్ బాబు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఇండ్లు లేని నిరుపేదలందరికీ ఇండ్లు కట్టిస్తామని చెప్పి 9 సంవత్సరాలు గడుస్తున్నా ఏ పేదవాడికి కూడా ఇప్పటివరకు ఇల్లు ఇచ్చినట్టు పరిస్థితులు లేవని అన్నారు. అదేవిధంగా నిజామాబాద్ నగరంలో వేల మంది కుటుంబాలు అద్దె ఇంట్లో కిరాయి కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రజాప్రతినిధులు గాని ప్రభుత్వం గాని పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. సీపీఐ(ఎం) పార్టీగా ఇండ్లు లేనటువంటి నిరుపేదలను గుర్తించి వారితో నిజామాబాద్ నగరంలో ప్రభుత్వ భూమిలో గత నాలుగు నెలలుగా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అక్కడే గుడిసెలు వేసుకొని ఎండకు ఎండి వానకు తడిసి రాత్రింబవళ్లు కష్టాలు పడుతూ పోరాటాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. ఇది నచ్చక కొంతమంది భూ కబ్జాదారులు ప్రభుత్వ భూమిని వెంచర్లుగా చేసినటువంటి వారు సీపీఐ(ఎం) నాయకుల పైన అలాగే ఈ గుడిసె వాసుల పైన తప్పుడు ఆరోపణలు చేస్తూ రూరల్ పోలీస్ స్టేషన్‌లో జిల్లా కార్యదర్శి మీద, అలాగే జిల్లా కార్యవర్గ సభ్యులు మల్యాల గోవర్ధన్‌లపై ఫిర్యాదు చేస్తే పోలీసులు కనీసం నిజ నిజాలు తెలుసుకోకుండా ఏ రకంగా కేసు పెడతారని ఏసీపీని ప్రశ్నించారు.

ఈ సందర్భంగా ఏసీపి కిరణ్ కుమార్ ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. అదేవిధంగా ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి ఆ భూమిని సర్వే చేయించి ప్రభుత్వ భూమిని భూ కబ్జాదారుల నుండి కాపాడాలని కోరారు. అదేవిధంగా ఉండడానికి జాగలేనటువంటి పేద ప్రజలకు అట్టి భూమిని పంచి ఇచ్చే వరకు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఈ భూ పోరాటం కొనసాగుతుందని ఎవరొచ్చినా భయపడేది లేదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి పెద్ది సూరి, నగర కార్యదర్శి వర్గ సభ్యులు బి సుజాత, పి మహేష్, కే రాములు, నగర కమిటీ సభ్యులు డి కృష్ణ ,అబ్దుల్, మునీర్ హైమద్, నరసయ్య, మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

బైక్‌చోరీ చేసిన వ్యక్తి రిమాండ్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ద్విచక్రవాహనం దొంగతనం చేసినా వ్యక్తిని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ ఐ గణేష్ తెలిపారు. ఎస్ఐ గణేష్ తెలిపినా వివరాల ప్రకారం ఎల్లారెడ్డి పట్టణానికి చెందినా కిరణ్ జులై 31 నాడు ఎల్లారెడ్డి గాంధీ చౌక్ వద్ద గల మార్కెట్‌లో తన ద్విచక్రవాహనం చోరీకి గురైనట్టు బాధితుడి ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టారు. సిసి కెమెరాల ఆధారంగా నిజాంసాగర్ మండలం కోమలంచ గ్రామానికి చెందిన రాజశేఖర్ ను (26) అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించినట్లు తెలిపారు.

భీంగల్, మెండోరాలో నేడు మంత్రి పర్యటన

నవతెలంగాణ-నిజామాబాద్

భీంగల్, మెండోరా మండలాల్లో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి గురువారం పర్యటించనున్నారు. భీంగల్ మండలం మెండోరా గ్రామంలో మెండోరా నుండి లింబాద్రి గుట్ట వరకు నూతన బిటి రోడ్ నిర్మాణం పనుల శంకుస్థాపన చేయనున్నారు. చెంగల్ 44 నుండి చెంగల్ వరకు వయా చింతలూరు సింగిల్ నుండి డబుల్ లైన్ బిటి రోడ్ నిర్మాణం పనులు శంకుస్థాపన చేయనున్నారు. పచ్చల నడ్కుడా నుండి వాడి వరకు సింగిల్ లైన్ నుండి డబుల్ లైన్, ఏర్గట్ల,కమ్మర్పల్లి,వేల్పూర్ మండలాల లోని వివిధ గ్రామాల కుల సంఘాల నిర్మాణాల కోసం నిధులు మంజూరు అయిన ప్రొసీడింగ్ కాపీలను ఆయా సంఘాల సభ్యులకు మంత్రి అందజేస్తారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య


తల్లిని కోల్పోయిన చిన్నారులు

నవతెలంగాణ-బిచ్కుంద

కుటుంబ కలహాలతో వివాహిత ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బిచ్కుంద మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ మురళి వివరాల ప్రకారం.. బిచ్కుంద మండల కేంద్రానికి చెందిన బర్ల సునీత (35) మొదటి భర్తతో విడాకులు కాగా వీరికి ఒక కొడుకు ఉన్నారు. జుక్కల్ మండలం మహ్మదాబాద్ గ్రామానికి చెందిన గణేష్ తో రెండవ వివాహం చేసుకొని కూలీ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి పది నెలల కూతురు ఉంది. గత కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చి భర్త గణేష్ ఇంటికి రాకపోవడం ఫోన్ చేసినా లేపకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఈ నెల 12వ తేదీనా సునీత పోలీస్ స్టేషన్ కు వచ్చి భర్త విషయం తెలపడంతో ఫోన్లో భార్యాభర్తలకు కౌన్సెలింగ్ చేసి తిరిగి పంపించారు. ఇటీవల గొడవలు చోటుచేసుకోవడంతో భర్త ఇంటికి రాకపోవడంతో మనస్తాపంతో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి మేనమామ బాలాబోయ్ ఫిర్యాదు మేరకు పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బాన్సువాడ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎస్సై తెలిపారు.

మూఢనమ్మకాలను తిప్పికొట్టాలి

- విద్యార్థులకు ఎస్ఐ సుచన

నవతెలంగాణ-సదాశివనగర్

మూఢనమ్మకాలపై ఎల్లప్పుడూ అపోహలు పెట్టుకోకుండా మూఢనమ్మకాలపై పై ప్రజలకు అవగాహన కల్పించి వాటిని తిప్పికొట్టాలని విద్యార్థులకు ఎస్ఐ మల్లెపు నర్సయ్య సూచించారు. బుధవారం అడ్లూర్ ఏల్లారెడ్డిలోని ప్రభుత్వ పాఠశాలలో 9,10 వ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాలు నేరమని ఎక్కడ బాల్య వివాహాలు జరిగినా 100కు డయల్ చేయాలన్నారు. మైనర్ విద్యార్థులు వాహనాలు నడపరాదని సూచించారు. విద్యార్థులు కష్టపడి జీవితంలో స్థిరపడినప్పుడే తల్లిదండ్రులకు నిజమైన గౌరవం దక్కుతుందన్నారు. ఎక్కడైనా ఆ సాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.ప్రతి విద్యార్థి లక్ష్యసాధన దిశగా అడుగులు వేస్తూ జీవితంలో స్థిరపడాలన్నారు .ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది దేవరాజ్, రామాంజనేయులు, కల బృందం రవి, సాయిలు,క్యాతం వెంకట లక్ష్మి లతో పాటు, పాఠశాల ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీనియారిటీకి, సిన్సియారిటీకి మధ్య ఎన్నికలు

- షకీల్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలి : ఎమ్మెల్సీ కవిత


సభకు హాజరైన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు


ర్యాలీగా వస్తున్న ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే షకీల్, నాయకులు

నవతెలంగాణ-బోధన్

రాబోయే ఎన్నికలలో ఎమ్మెల్యే షకీల్ ను భారీ మెజార్టీ గెలిపించాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని ఎన్ఎస్ఎఫ్ గ్రౌండ్లో బూత్ కమిటీలు, కార్యకర్తల సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. అంతకుముందు కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీగా సభా కేంద్రానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇది తొలి ఎన్నికల సభ అని ఇదే లక్ష్యంతో భారీ విజయం సాధించాలన్నారు. సభకు పాదయాత్రగా తనతో పాటు భారీ సంఖ్యలో జనం పాల్గొన్నారని ఇది ఎన్నికల విజయోత్సవ సభగా ఉందని అన్నారు.

అనంతరం ఎమ్మెల్యే షకీల్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవిత ఆశీస్సులతో తొమ్మిదిన్నర సంవత్స రాలుగా బోధన్ నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. బోధన్ నియోజకవర్గాన్ని 3000 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశామ న్నారు. కరోనా సమయంలో వేలాదిమందికి ఆపదలో అన్ని రకాల సహాయం చేసి ఆదుకున్నా మని అన్నారు. బిజెపి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏనాడు ప్రజలకు సహాయం చేయలేదని అన్నారు. మేడపాటి ప్రకాష్ రెడ్డి అన్ని పార్టీలు మారుస్తు టికెట్ రాకపోవడంతో చివరికి ఎంఐఎం పార్టీలో సైతం వలస వెళ్లే అవకాశం ఉందన్నారు. ప్రజలకు ఇలాంటి నాయకులు అవసరమా అని ప్రశ్నించారు. ప్రజలను మోసం చేయడానికి వస్తున్న ఇలాంటి నాయకులను తరిమికొట్టాలన్నారు. కెసిఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందని ఇల్లు లేదని కావున ఈసారి కూడా కేసీఆర్ ప్రభుత్వాన్ని బలపరుద్దామని అన్నారు. అలాగే మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి పాలనపై మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ రజిత యాదవ్, ఎంపీపీలు బుద్దె సావిత్రి, కొండెంగల శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ విఆర్ దేశాయ్, జెడ్పిటిసి లక్ష్మి, బి ఆర్ ఎస్ ముఖ్య నాయకులు బుద్దే రాజేశ్వర్, డిసిసిబి డైరెక్టర్లు గంగారెడ్డి, శరత్, బిఆర్ఎస్ నాయకులు రవికిరణ్, ఏఎంసి వైస్ చైర్మన్ సాలురా షకీల్, పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్, మండల అధ్యక్షులు నరసయ్య, ముఖ్య ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

అలరించిన మధుప్రియ ఆటపాట

బూత్ కమిటీ కార్యకర్తల సమావేశంలో భాగంగా ఏర్పాటు చేసిన సభలో అష్ట గంగాధర్ బృందం పాటలు, గాయని మధుప్రియ పాటలు సభికులను ఉత్సాహపరిచాయి. వారి పాటలకు అనుగుణంగా నాయకుల సైతం నృత్యాలు చేసి సభికులను ఉత్సాహపరిచారు.

కమ్మసంఘం భవనానికి 2 కోట్లు మంజూరి

బోధన్ మండలం మినార్ పల్లి రోడ్డు పక్కన నూతనంగా నిర్మించిన కమ్మ సంఘం భవనానికి తాను రెండు కోట్ల రూపాయలను మంజూరు చేస్తానని కల్వకుంట్ల కవిత హామీ ఇచ్చారు. త్వరలో 50 లక్షల మంజూరు చేస్తానని, ఎన్నికల అనంతరం మిగిలిన నిధులను మంజూరు చేస్తానని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కమ్మ సోదరులు సైతం అభివృద్ధిలో భాగం కావాలని కోరారు. తెలుగు భాష ఆత్మ గౌరవాన్ని నిలిపిన మహనీయుడు ఎన్టీఆర్ అని అన్నారు. ఎంపీ ఎన్నికలలో తనకు ఎంతో అండగా నిలిచారని వారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే షకీల్ మాట్లాడుతూ కమ్మ సంఘంలో ఉన్న నాయకులు గతంలో తనతో పాటు తెలుగుదేశం పార్టీలో పనిచేసిన వారు ఉన్నారని గుర్తు చేశారు. కాబట్టి అప్పటినుండి కమ్మ సోదరులతో ఎనలేని బంధం ఏర్పడింద న్నారు. కమ్మ సామాజిక వర్గంలో ప్రభుత్వం అందిస్తున్న రైతుబంధు పథకం లబ్ది పొందడం జరిగిందని అన్నారు. బోధన్‌లో తానే సొంతంగా ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కమ్మ సంఘం నాయకులు రవి కిరణ్, అమర్నాథ్ బాబు, కోటపాటి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ప్రతిఓటూ కీలకం

- ఓటర్లందరూ తమ హక్కును వినియోగించుకోవాలి
- ఓటరుగా నమోదు.. మార్పులు, చేర్పులకు ప్రత్యేక డ్రైవ్, చివరి అవకాశం : కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమైనదని, ఓటరుగా నమోదయిన ప్రతి వ్యకి తమ అమూల్యమైన ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కలిగించాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సూచించారు. ప్రతి బూతు స్థాయి లో తమ ప్రతినిధులను ఏజెంట్లు నియమించు కోవాలని, డ్రాఫ్ట్ ఓటరు జాబితాను పరిశీలించి మార్పులు, చేర్పులు ఉంటే చేసుకోవాలని సూచించారు. సెకండ్ సమ్మరి రివిజన్‌పై బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహిం చిన సమావేశంలో మాట్లాడారు.

ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు ఈ నెల 27,28 సెప్టెంబర్ 2, 3 తేదీలలో ప్రతి బూతు స్థాయిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని యువత, ఓటర్లు వినియోగించుకునే విధంగా చూడాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఈ నెల 21 న డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ ప్రచు రించబడుతుందని, అట్టి ప్రతిని అందరికి అందజేస్తా మన్నారు. అక్టోబర్ 4 న తుది ఓటర్ల జాబితా వెలువడు తుందని, ఆ జాబితా ప్రకారమే ఎన్నికలు జరుగుతాయని అన్నారు. ఓటరు జాబితాలో పేరులో మార్పులు, చేర్పులకు ఇదే చివరి అవకాశమని, అర్హులైన ప్రతి యువత ఓటరుగా నమోదయ్యేలా చూడాలన్నారు. జనాభాలో 5 శాతం 18-19 ఏళ్ళు నిండి వారుంటారని, జిల్లాలో రెండున్నర శాతం మాత్రమే ఓటరుగా నమోదయ్యారని, 18 ఏళ్ళు నిండిన యువత ఓటరుగా నమోదయ్యేలా చూడాలన్నారు.

చనిపోయిన వారి పేర్లు ఉంటే తొలగించాలని, ఒకే కుటుంబంలోని ఓటర్లు వివిధ పోలింగ్ బూతులతో ఉంటే సరిచేసుకోవాలని, అర్హులను ఓటరుగా నమోదు చేయించాలన్నారు. ఏమైనా సమస్యలుంటే 1950 టోల్ ఫ్రీ నెంబరుకు డయల్ చేయాలని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఓటర్లకు కూడా ఈ వి ఏం ల ఓటింగ్ చేయుటపై కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయాలతో పాటు మొబైల్ వ్యాన్ ల ద్వారా మాక్ పోల్ నిర్వహిస్తూ అవగాహన కనిపిస్తున్నామన్నారు. ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా పాటించాలని, కుల, మత విద్వేషాలకు తావివ్వరాదని, వ్యక్తిగత దూషణ చేయరాదని, ఓటర్లను నగదు, మద్యంతో ప్రలోభపెట్టరాదని, అభ్యర్థి గరిష్టంగా రూ. 40 లక్షలకు ఖర్చు మించకుండా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఖాసీం అలీ, నరేందర్, నరేష్ గౌడ్, జఫ్ఫార్ ఖాన్, తాహెర్, హరిలాల్, వెంకట్ గౌడ్, బాల్ రాజు పాల్గొన్నారు.

జీవాలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

నవతెలంగాణ-సిరికొండ



మండలంలోని తూంపల్లి గ్రామంలో బుధవారం జిల్లా పశువైద్య శాఖ, ప్రాథమిక పశు వైద్య కేంద్రం సిరికొండ ఆధ్వర్యంలో జీవాలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. 593 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశు వైద్య అధికారి బాబురావు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లె బాలమణి మల్లేష్, ఎంపీటీసీ లింగం, వీడిసి సభ్యులు పశు వైద్య సిబ్బంది వెటర్నరీ అసిస్టెంట్ శ్రీనివాస్, సతీష్, గ్రామ పాడి రైతులు పాల్గొన్నారు.

బూత్ కమిటీల ఏర్పాటు

నవతెలంగాణ - మాక్లూర్



మండలోని చిక్లీ, కొత్తపల్లి, మాక్లూర్ గ్రామంలో ఆర్మూర్ ఎమ్మెల్యే జిల్లా అధ్యక్షులు ఆశన్న గారి జీవన్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం బూత్ కమిటీలు వేశారు. ఎర్డీ మండల అధ్యక్షులు బడుగు సత్యనారాయణ, మండల యూత్ ఉపాధ్యక్షులు దిమెరీ శ్రీకాంత్, మండల ప్రధాన కార్యదర్శి సుంకరి రవి, అధ్యక్షతన బీఆర్ఎస్ పార్టీ బూత్ కమిటీ దాదాపు 250 మంది సభ్యులతో ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అశోక్ కుమార్, కొత్తపల్లి సుబ్బారావు, మాజీ సర్పంచ్ వెంకట్ గౌడ్, హరిచరణ్, నవీన్, నాయకులు పాల్గొన్నారు.

కొత్త ఓటర్‌కార్డుల పంపిణీపై దృష్టి సారించాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



వీసీలో మాట్లాడుతున్న సీఎస్

పాల్గొన్న కలెక్టర్

సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ సూచించారు. ఓటరు జాబితాలో కొత్తగా పేర్లు నమోదు చేసుకున్న వారందరికీ పోస్టల్ శాఖ ద్వారా వెంటదివెంట గుర్తింపు కార్డులు చేరేలా పర్యవేక్షణ జరపాలని అన్నారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సిఈఓ సమీక్ష జరిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం వారీగా క్షేత్ర స్థాయిలో సిబ్బంది ఇంటింటికి తిరిగి పరిశీలన జరిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త ఓటర్లకు సంబంధించిన కార్డులు ప్రింటింగ్ పూర్తయ్యి, పంపిణీ కోసం పోస్టల్ శాఖకు అందించినట్లైతే, అవి ఓటర్లకు చేరాయా అన్నది నిర్ధారించుకోవాలి అన్నారు. 18 - 19 సంవత్సరాల వయస్సు కలిగిన యువతీ, యువకులు తప్పనిసరిగా ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకునేలా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 19 వ తేదీన అన్ని సెగ్మెంట్ల పరిధిలో 5కె రన్ నిర్వహించాలని సీ.ఈ.ఓ సూచించారు. అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు సహా అన్ని వర్గాల వారు భాగస్వాములయ్యేలా చూడాలన్నారు. పోలింగ్‌లో పాల్గొనాల్సిన ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి నియోజకవర్గం పరిధిలో అవగాహన కేంద్రాలు, సంచార వాహనాలతో పాటు సామాజిక మాధ్యమాల ద్వారా కూడా ప్రచారం చేయాలని సూచించారు. ఈ నెల 21 న గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, ఓటరు జాబితా డ్రాఫ్ట్ పబ్లికేషన్ ఓటరు జాబితాను అందించాలని అన్నారు. దివ్యాంగులైన ఓటర్లకు సంబంధించి, జాబితాలో ప్రత్యేకంగా మార్కింగ్ చేయాలని, దీనివల్ల వారికి అవసరమైన ర్యాంప్, వీల్ చైర్ వంటి అదనపు సౌకర్యాలను అందుబాటులో ఉంచేందుకు వీలవుతుందని తెలిపారు. థర్డ్ జెండర్ల వివరాలను జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయాల నుండి సేకరించి, ఓటర్ల జాబితాలో అర్హులైన వారి పేర్లు ఉన్నాయా, లేవా అన్నది పరిశీలించుకోవాలని అన్నారు. వారి సమ్మతి మేరకు జాబితాలో స్త్రీ, పురుష ఓటర్లుగా పేర్లు నమోదు చేయాలని సూచించారు. గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలలో తక్కువ ఓటింగ్ నమోదైన పోలింగ్ కేంద్రాలను గుర్తిస్తూ, అందుకు గల కారణాలను నిశితంగా పరిశీలన జరపాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, డీసీఓ సింహాచలం, ఎన్నికల విభాగం సిబ్బంది సాత్విక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు రోగుల నిర్ధారణ చేపట్టాలి

- ఆరోగ్య విస్తరణ అధికారి వై శంకర్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కుష్టు రోగుల నిర్ధారణ చేపట్టాలని ఇందల్ వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తరణ అధికారి వై శంకర్ అన్నారు. మండలంలోని రాంపూర్ (డి) గ్రామంలో కుష్టు రోగుల నిర్ధారణ కార్యక్రమం బుధవారం పరిశీలించారు. ఆశా కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ఎవరి శరీరంపైనైనా ఏవైనా గోధుమ రంగు మచ్చలు, చెమట లేని మచ్చలు, స్పర్శ లేని మచ్చలు ఉన్నట్లయితే వాటిని పరిశీలించాలన్నారు. స్పర్శ పరీక్ష నిర్వహించి నిర్ధారణకు జిల్లా అధికారులకు నివేదించడం జరుగుతుందని వివరించారు. మచ్చలు ఒకటి కంటే ఎక్కువగా ఉన్నట్లయితే ఆ కేసును మల్టీ బాసిల్లై కేసు కింద నమోదు చేయాలని వారికి సూచించారు. కార్యక్రమం 30 ఆగస్టు వరకు కొనసాగుతుందని తెలిపారు. ఆశా కార్యకర్తలకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్ పి. రేణుక, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన న్యాయవాదులు



న్యాయమూర్తిని సన్మానిస్తున్న న్యాయవాదులు

నవతెలంగాణ-ఆర్మూర్

హైకోర్టు న్యాయమూర్తి మరియు భవన నిర్మాణ కమిటీ సభ్యుడు జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డిని బుధవారం బార్ అసోసియేషన్ న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, న్యాయస్థానంలో నూతన భవనం, అదనపు జిల్లా జడ్జి కోర్టును ఏర్పాటు చేయాలని ఖాళీగా ఉన్న ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జిని నియమించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సరసం చిన్నారెడ్డి అధ్యక్షతన కార్యవర్గ సభ్యులు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు తులసి దాస్, పండిత్, ఏలేటి గంగాధర్, కిష్టయ్య, కాందేశ్ శ్రీనివాస్, శ్రీధర్,జీవన్, జూనియర్ న్యాయవాదులు అరుణ్, సుకేష్ రాములు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేనెంబర్ల ప్రకారం పంట వివరాలు నమోదు చేయాలి

- జిల్లా వ్యవసాయాధికారి వాజీద్ హుస్సేన్

నవతెలంగాణ-మెండోర



పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

సర్వేనెంబర్ల ప్రకారం పంట వివరాలు నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి వాజీద్ హుస్సేన్ అన్నారు. మండలంలోని వెల్గటూరు గ్రామంలో జిల్లా వ్యవసాయ అధికారి వాజీద్ హుస్సేన్ బుధవారం పర్యటించి పంటల నమోదు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో సర్వే నెంబర్ల ప్రకారం.. రైతులు వేసిన పంట వివరాలు ఎటువంటి తప్పులు లేకుండా క్షేత్ర స్థాయిలో పరిశీలించి నమోదు చేయాలని గ్రామ స్థాయి వ్యవసాయ అధికారులకు సూచంచారు. అనంతరం వెల్గటూరు యూనియన్ బ్యాంకు లో రుణమాఫీ వివరాల గురించి బ్యాంకు అధికారులని అడిగి తెలుసుకున్నారు. మొత్తం రైతులు సంఖ్య , వారి తీసుకున్న మొత్తం , రుణమాఫీ అమలు తదితర వివరాలు బ్యాంకు అధికారుల వద్ద సేకరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజ్ కుమార్ , ఏఈఓ రాజేశ్వర్ , రైతులు, బ్యాంకు అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.

చక్కెర ఫ్యాక్టరీని తెరిపించండి : ఏఐకేఎంఎస్

- నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



మాట్లాడుతున్న నాయకులు

చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించాలని ఈనెల 17న జరిగే రౌండ్ టేబుల్ సమావేశాలను విజయవంతం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాలో గల రెండు చక్కెర ఫ్యాక్టరీలు పాలకుల తప్పుడు విధానాలు, అధికారుల అవినీతి మూలంగా మూతపడ్డాయని అన్నారు. బోధనలోని ఎన్ఎస్ఎఫ్ నిజామాబాదులోని ఎన్ఎస్ఎఫ్ సారంగాపూర్ ఫ్యాక్టరీని తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 100 రోజుల్లో తెరిపిస్తామన్న మాటకు తొమ్మిదిన్నర సంవత్సరాలైనా నెరవేరలేదు. ఈమధ్య పరిశ్రమల శాఖ మంత్రి తారక రామారావు రైతులు నడుపుకోగలి గితే బోధన్ చక్కెర ఫ్యాక్టరీని సహకార రంగంలో రైతులకు అప్పగిస్తామని అన్నారు కానీ, సహకార రంగంలో కొనసాగిన ఏకైక చక్కెర ఫ్యాక్టరీ ఎన్ఎస్ఎఫ్ సారంగాపూర్ గురించి ఊసే లేదని తెలిపారు. ఈ ఫ్యాక్టరీ 2008లో మూత పడిందని, ప్రభుత్వం సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీను తెరిపించి నడిపించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇథనాల్ ఉత్పత్తి ప్రోత్సహిస్తున్నందున ఫ్యాక్టరీ తెరవడంవల్ల దాని ఉత్పత్తి కూడా చేసుకోవచ్చుని అన్నారు. ఇప్పటికైనా చెరుకు ఫ్యాక్టరీలను తెరిపించి నడిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఒకవేళ నడపకపోతే ఈ ఫ్యాక్టరీ పై అప్పులన్నీ మాఫీ చేసి 95 యాక్ట్‌లో రైతులకు అప్పఅప్పజెప్పాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ సాధనకు ఈ నెల 17న చెరుకు ఉత్పత్తిదారుల సంఘం, అఖిలభారత రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోగల ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో అతిథిగృహంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశానికి రైతు సంఘాల నాయకులు రైతులు హాజరుకావాలని కోరారు. సమావేశంలో చెరుకు రైతు నాయకులు ఎం.నాగయ్య, ఏఐకెఎంఎస్ ఉపాధ్యక్షులు టి. కృష్ణ గౌడ్, సహాయ కార్య దర్శి చిన్నయ్య, దుర్గ ప్రసాద్ గౌడ్, గంగ సాయిలు తదితరులు పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాలపట్ల వివక్షా..?

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రభుత్వానికి బడుగు బలహీన వర్గాల పట్ల వివక్ష, చిన్న చూపు ఎదుకని తెలంగాణ యూనివర్సిటీ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాదల్ లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య, బీసీ విద్యార్థి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల రామకృష్ణ అక్రమ అరెస్టుల్ని ఖండిస్తున్నామన్నారు. అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాలను ఎవరు ఆపలేరని, ఇది పిరికిపందల చర్యగా భావిస్తున్నామని అన్నారు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో ఉద్యమాలకు ఉద్యమ నాయకులకు నియంత్రించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సమావేశంలో తెలంగాణ యూనివర్సిటీ అధ్యక్షుడు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి నవీన్, కార్యదర్శి సూర్య తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి వాసికి ఉత్తమ సేవాపత్రం

నవతెలంగాణ-డిచ్‌పల్లి



సేవాపత్రం అందజేస్తున్న మంత్రి

చంటి పిల్లల నిపుణులు ఎం.డి పీడియాట్రిక్, గోల్డ్ మెడలిస్ట్ డాక్టర్ దీపక్ రాథోడ్ ఉత్తమ సేవాపత్రం అందుకున్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో 77వ స్వాతంత్ర్య దినోత్సవం సంవర్భంగా రోడ్లు భవనాల నిర్మాణ శాఖా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సేవాపత్రం అందించారు. నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో (స్పెషల్ నియోనటల్ కేర్ యూనిట్)లో ఉత్తమ సేవలు చేయడంతో ఉత్తమ సేవ ప్రశంస పత్రం అందజేశారు. ఈసందర్భంగా డిచ్‌పల్లి మండలకేంద్రానికి చెందిన డాక్టర్ దీపక్ రాథోడ్‌ను పలువురు అభినందించారు. బుదవారం ఘన్ పుర్ గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఇతరులు డాక్టర్ దీపక్ రాథోడ్, కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. రాబోవు రోజుల్లో ఉన్నత స్థాయిలో ప్రశంసలు అందుకోవాలని వారందరూ ఆకాంక్షించారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రభుత్వ బాలికల కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకులు దేవరాం జిల్లా ఉత్తమ అధ్యాపకునిగా ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో తోటి అధ్యాపకులందరూ కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అక్బరీ బేగం, పీడీ గంగాధర్ పాల్గొన్నారు.

డాక్టరేట్ పొందిన మండలోజు నర్సింహ స్వామికి ఘనసన్మానం



నర్సింహస్వామిని సన్మానిస్తున్న శాంభవి స్కూల్ చైర్మన్, తదితరులు

నవతెలంగాణ-బాల్కొండ

సాహిత్యంలో భాగంగా కీ.శే. ఆచార్య గుమ్మన్నగారి బాలశ్రీనివాస మూర్తి పర్యవేక్షణలో మండలోజు నర్సింహస్వామి చేసిన పరిశోధనాంశం "డా. వెలిచాల కొండలరావు జీవితం - వాఙ్మయ సేవ" అనే సిద్ధాంత గ్రంథానికి తెలంగాణ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం నుండి డాక్టరేట్ ప్రధానం చేశారు. వీరు బాల్కొండ నివాసి కావడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. బాల్కొండ మండలంలోని మొట్టమొదటి డాక్టరేట్ పట్టానుపొంది బాల్కొండకే కీర్తిని సాధించి పెట్టారని అన్నారు. మండలంలోని విద్యార్థులు, యువకులు అందరూ కూడా వీరిని ఆదర్శంగా తీసుకొని మంచి పేరు తేవాలని సూచించారు. శాంభవి స్కూల్ చైర్మన్ మధుసూధన్ రాజు బొట్ల, కరస్పాండెంట్ రవీన్ ప్రసాద్ బొట్ల, ప్రిన్సిపల్ ఇంద్రాణి, విజయలక్ష్మి ఉపాధ్యాయ బృందం ఆయన్ను ఘనంగా సన్మానించారు. మండలోజు నరసింహస్వామి ప్రభుత్వ జూనియర్ కళాశాల భీంగల్‌లో తెలుగు అధ్యాపకునిగా పనిచేస్తున్నారు. ఈ మధ్యనే ఆయన్న జూనియర్ కళాశాల లెక్చరర్‌గా పర్మినెంట్ చేయడం ఈ గ్రామానికి ఎంతో గర్వకారణమని అన్నారు.

బీఆర్ఎస్ పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి

- మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

నవతెలంగాణ-వేల్పూర్



బీఆర్ఎస్‌పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో రాష్ట్ర సీఎం కేసీఆర్ జనరంజక పాలన,అమలవుతున్న సంక్షేమ పథకాలు,బాల్కొండ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై కమ్మర్పల్లి మండలం నాగపూర్, నర్సాపూర్ గ్రామాల నుండి కాంగ్రెస్, బీజేపీ పార్టీలు, కుల సంఘాలకు చెందిన సుమారు 300మంది సభ్యులు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో భారత రాష్ట్ర సమితిలో బుధవారం చేరారు. వారికి మంత్రి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. నాగపూర్ నుండి యాదవ, కుర్మ, మాల సంఘం, బంజారా సంఘం, నర్సాపూర్ గ్రామం నుండి వివిధ యువజన సంఘాల సభ్యులు, పార్టీలకు చెందిన కార్యకర్తలు చేరారు.

నుడా చైర్మన్ ప్రత్యేక పూజలు



సంజీవరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

నుడా చైర్మన్‌గా నియమితులైన అనంతరం ఈగ సంజీవరెడ్డి బుధవారం తొలిసారిగా నిజామాబాద్‌కు వచ్చారు. సాయిబాబా మందిరంలో అర్చన, పూజా కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. అనంతరం బోర్గంలోని ఆయన ఇంటివకు ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మీసాల మధుకర్ రావు, ఎంపీపి అనూష ప్రేమ్ నాయక్, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముత్కేడ్ - మేడ్చల్ డబ్లింగ్


- కేంద్ర కేబినెట్ ఆమోదం

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ముత్కేడ్ -మేడ్చల్, మహబూబ్ నగర్ -డోన్ సెక్షన్ల మధ్య 502.34. కి. మీ లతో 5655.4 కోట్ల అంచనా వ్యయంతో ప్రస్తుతమున్న సింగల్ రైల్వే లైన్‌ను డబుల్ రైల్వే లైనుగా మార్చుటకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ఎంపీ అర్వింద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొన్న నిజామాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణకు 53 కోట్లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని, ఇప్పుడు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు ఈ ప్రాజెక్టు చేపట్టాలని తాను చేసిన విజ్ఞప్తులకు భారీ మొత్తంలో నిధులు మంజూరు చేసిన ప్రధాని మోదీ కి రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటికే ముత్యేడ్ నుండి బాసర వరకు పట్టాలు వేసేందుకు భూమి చదును చేస్తున్నారని, అతి త్వరలోనే డబుల్ లైన్ పనులు ప్రారంభమవుతాయని ఎంపీ పేర్కొన్నారు. డబుల్ లైన్ పూర్తయితే నిజామాబాద్ నుండి ముంబై, పూణే, షిరిడి, నిజామాబాద్ నుండి బెంగళూరుల మధ్య రైల్వే కనెక్టివిటీ పెరగడమే కాకుండా ప్రయాణం సులభతరం అవుతుందని తెలిపారు.

ఆర్థిక సహాయం చెక్కు అందజేత

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



చెక్కు అందజేస్తున్న నాయకులు

మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన లోక జనార్దన్ రెడ్డికి ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరు చేసిన రూ.35వేల ఆర్థిక సహాయం చెక్కును బుధవారం అందజేశారు. మంత్రి ఆదేశాల మేరకు చెక్కును నేరుగా లబ్ధిదారు ఇంటికి వద్దకే వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బుస్సాపురం జీవన్, సర్పంచ్ పెండే ప్రభాకర్, సొసైటీ డైరెక్టర్ బుస్సాపురం నవీన్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వై.శంకర్‌కు ఉత్తమ ఆరోగ్య విస్తరణ అధికారి అవార్డు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య విస్తరణాధికారిగా పనిచేస్తున్న వై.శంకర్‌కు జిల్లా స్థాయి ఉత్తమ ఆరోగ్య విస్తరణ అధికారిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుదర్శనం, జిల్లా ఇమ్యూ నైజేషన్ అధికారి డాక్టర్ అశోక్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. మంగళవారం జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఈ అవార్డు స్వీకరించారు. ఈసందర్భంగా ఇందల్ వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సంతోష్ కుమార్, వైశంకర్ కు శుభాకాంక్షలు తెలిపారు.

కేసీఆర్ ఆశీర్వాదంతో....

బాల్కొండలో అభివృద్ధి పనుల పరంపర

- ప్రతీ రోజు రూ.కోటి తగ్గకుండా ఏదో ఒక పని ప్రారంభం
- కొంత మంది సోషల్ మీడియాలో కోడి గుడ్డు మీద ఈకలు పీకే ప్రయత్నం
- అభివృద్ధిపై చర్చనే కాదు.. దేనికైనా సిద్ధమే
- అబద్ధపు హామీల మాయలో పడొద్దు
- రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



ప్రారంభోత్సవం చేస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

ముఖ్యమంత్రి కేసిఆర్ ఆశీర్వాదంతో బాల్కొండ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల పరంపర కొనసాగుతుందని రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. బాల్కొండ మండలంలో బుధవారం పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రతీ రోజు కోటి రూపాయలకు తగ్గకుండా ఏదో ఒక అభివృద్ధి పని ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఇది గిట్టని కొంత మంది సోషల్ మీడియాలో కోడి గుడ్డు మీద ఈకలు పీకే ప్రయత్నం చేస్తున్నారనీ మండిపడ్డారు. తెలంగాణ ప్రభుత్వానికి ముందు 10ఏళ్ల కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన అభివృద్ధికి కనీసం రెండురెట్ల అభివృద్ధి ప్రతీ గ్రామంలో ఇప్పుడు జరిగిందన్నారు. దీనిపై చర్చనే కాదు.. నేను దేనికైనా సిద్ధమే అని మంత్రి సవాల్ చేశారు. అబద్ధపు హామీల మాయలో పడి మోసపోవద్దని ప్రజలు ఆలోచన చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

మోసపు హామీతో ఓట్లు దండుకున్న ఎంపీ అభివృద్ధి పనుల కోసం ఒక్క కొబ్బరికాయైనా కొట్టిండా..?

బాండ్ పేపర్ రాసిచ్చి రైతులను మోసం చేసి ఎంపీగా గెలిచిన అర్వింద్ అడ్రస్ లేకుండా పోయాడని మంత్రి ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. మోసపు హామీతో రైతుల ఓట్లు దండుకున్న అరవింద్ ఎంపీగా ఈ ప్రాంత అభివృద్ధి, కిసాన్ నగర్‌లో అభివృద్ధి కోసం ఒక్క కొబ్బరికాయ అయినా కొట్టిండా అని నిలదీశారు. గెలిపిస్తే 5 రోజుల్లో తెస్తానన్న వసుపు బోర్డు 5 ఏళ్లైనా దాని ఊసేలేదని, కేసిఆర్, కేటిఆర్, కవిత, ప్రశాంత్‌రెడ్డిని తిట్టడానికే ఆయనకు 4ఏళ్లు గడిచిపోయాయని ఎద్దేవా చేశారు. మోసపు మాటలు చెప్తున్న వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలనీ, అభివృద్ధి పనులు చేస్తూ..ప్రజల మేలు కోరే కేసిఆర్‌కు అందరూ అండగా నిలవాలని కోరారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బాల్కొండ మండలకేంద్రంలో రూ.2 కోట్లతో అంబేద్కర్ చౌరస్తా నుండి భూమారెడ్డి ఇంటి వరకు సెంట్రల్ లైటింగ్, రోడ్డు వెడల్పు, డివైడర్ పొడిగింపు పనులకు, రూ.2.65 కోట్లతో తెలంగాణ ఫంక్షన్ హాల్ నుండి డబుల్ బెడ్ రూమ్స్ వయా సంతమల్లన్న గుడి నూతన ఆర్అండ్‌బి బిటి రోడ్ ఏర్పాటు, 44.62లక్షలతో బాల్కొండ మండల కేంద్రంలో రింగ్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కిసాన్ నగర్ గ్రామంలో 20 లక్షలతో పంచాయతీ బిల్డింగ్ నిర్మాణ పనులకు, రూ.2.42కోట్లతో కిసాన్ నగర్ నుండి జలాల్ పూర్, నాగపూర్ ఎక్స్ రోడ్ వరకు సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించే పనులకు శంకుస్థాపన చేసి, బిఆర్ఎస్ పార్టీ నూతన కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారి

నవతెలంగాణ-కోటగిరి

పోతంగల్ మండల కేంద్రంలో ఉమ్మడి మండలంలోని ఆశాలు, ఆరోగ్య సిబ్బందికి కుష్టు వ్యాధిపై సర్వే అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కుష్టు వ్యాధి అనుమానితులను ఏ విధంగా గుర్తించాలనే విషయాలపైన క్లుప్తంగా వివరించారు. సర్వేను ఈనెల 16 నుంచి 31 వరకు అన్ని గ్రామాలలో నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ప్రతి రోజు ఆశ కార్యకర్తలు 25 నుంచి 30 ఇండ్లను సందర్శించి అందరిని పూర్తిగా పరీక్ష చేయాలని, అనుమానితుల వివరాలు పూర్తిగా సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు సాయి కుమారి, జ్యోతి, లేప్రోసి సిబ్బంది జయమ్మ పాల్గొన్నారు.

నవతెలంగాణ

కామారెడ్డి

3

గురువారం 17 ఆగస్టు 2023

మద్నూర్ సొసైటీ పరిధిలో 299 మందికి రుణమాఫీ

● సొసైటీ కార్యదర్శి బాబురావు వెల్లడి

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రంలో గల సింగిల్ విండో కార్యాలయంలో వ్యవసాయ రైతులు తీసుకున్న రుణానికి రాష్ట్ర ప్రభుత్వం సొసైటీ పరిధిలో 299 మంది రైతుల రుణమాఫీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు సొసైటీ కార్యదర్శి జె.బాబురావు తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి రూ.99వేల వరకు తీసుకున్న రుణాన్ని మాఫీ చేస్తుందని అందులో భాగంగా 299 మంది రైతుల రుణమాఫీకి గానూ రూ.కోటి 27 లక్షల 87 వేల నాలుగు రూపాయలు మాఫీ చేసినట్టు తెలిపారు. రుణమాఫీ చేసిన రైతులకు వారి ఆధార్ కార్డు, రుణం తీసుకున్న పాసుబుక్కు పరిశీలించి తీసుకున్న రుణాన్ని రుణమాఫీ కింద జమ చేసుకోనున్నట్టు విండో కార్యదర్శి వెల్లడించారు.

నీళ్లు రాక అల్లాడిపోతున్నాం

● మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో సభ్యుల ఆవేదన
● పలు శాఖల అధికారులూ సక్రమంగా పనిచేయడం లేదు
● సభదృష్టికి తీసుకొచ్చిన ప్రజాప్రతినిధులు


సమావేశంలో మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-తాడ్వాయి

మిషన్ భగీరథ నీళ్ల రాకపోవడంతో అల్లాడిపోతున్నామని సర్పంచులు, ఎంపీటీసీలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తాడ్వాయి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ కౌడి రవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీలు గ్రామాల్లోని ట్యాంకులోకి మిషన్ భగీరథ నీళ్ల సక్రమంగా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఎంతో ప్రతిష్టాత్మకంగా మిషన్ భగీరథను ప్రారంభించినా.. అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామాలకు సక్రమంగా నీళ్లు సరఫరా కావడం లేదని మండిపడ్డారు. కొన్ని గ్రామాల్లో నీళ్లు వచ్చిన నీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉందన్నారు. బ్రాహ్మణపల్లి గ్రామంలో నీటి సరఫరా సక్రమంగా లేదని ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి అధికారులపై మండిపడ్డారు. మిషన్ భగీరథ ఏఈలు వినోద్, బాలకృష్ణ గ్రామాలకు రావడం లేదని నీటి సరఫరాను పట్టించుకోవడంలేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మిషన్ భగీరథకు ఇద్దరు ఏఈలు ఉన్నా ఒక్కరు గ్రామాలకు రావడం లేదన్నారు. ఎన్నిసార్లు చెప్పినా కరెంటు సమస్యలు పరిష్కరించడం లేదని కరడ్‌పల్లి సర్పంచ్ బాలచంద్రం, దేమికలాన్ సర్పంచ్ పవురాజ్, ఎర్రపహాడ్ ఎంపీటీసీ జలంధర్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కరెంటు సమస్యలు చాలా ఉన్నాయని ఇన్చార్జి ఏఈ భాస్కర్‌పై మండిపడ్డారు. చిట్యాలలో తీవ్రమైన కరెంట్ సమస్య నెలకొందని సర్పంచ్ మ్యాడం కవితా బాలయ్య ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ విషయమై అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. ఎర్రపహాడ్‌లో అసలు వైద్యాధికారి పనిచేస్తున్నారా లేరా వైద్యాధికారి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎప్పుడు వస్తున్నారో, ఎప్పుడు వెళ్తున్నారో తెలియని పరిస్థితి నెలకొందని సర్పంచులు, ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యాధికారి సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలో అధికారులు సక్రమంగా పనిచేయక పోవడంతో సమస్యలు తీవ్రమవుతున్నాయని సర్పంచులు మండిపడ్డారు. ఇకనైనా సమస్యలు పరిష్కరించడంలో చర్య లు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కౌడి రవి, జెడ్పీటీసీ రమాదేవి నారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ పులగం సాయిరెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ నల్లవెల్లి కపిల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నర్సింలు, ఎంపీడీవో రాజ్‌వీర్, తహసీల్దార్ సునీత తదితరులు పాల్గొన్నారు.

టూరిజం కార్పొరేట్ చైర్మన్‌ను కలిసిన రాష్ట్ర సెన్సార్ బోర్డు మెంబర్



నవతెలంగాణ-లింగంపేట్

తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మెన్, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్‌ను బుధవారం హైదరాబాద్‌లోని వారి నివాసంలో రాష్ట్ర సెన్సార్ బోర్డు మెంబర్, బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు అతిమాముల రామకృష్ణ గుప్తా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన పుష్పగుచ్ఛం అందజేశారు. కామారెడ్డి జిల్లాలో చారిత్రక కట్టడాలు ప్రాచీన కట్టడాలు అధికంగా ఉన్నాయన్నారు. వాటిని పునర్నిర్మాణం చేపట్టి పర్యాటక కేంద్రంగా మార్చడానికి చొరవ చూపాలన్నారు. అదేవిధంగా లింగంపేట్ మండలంలో నాగన్నగారి మెట్ల బావి చారిత్రక కట్టడం పునర్ నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. ఆయా మండలాల్లో టూరిజం ప్రదేశాలు చాలా ఉన్నాయని, టూరిజం ప్రదేశాలను మెరుగుపరిచినట్లైతే ప్రభుత్వానికి అదనంగా ఆదాయం వస్తుందని తెలిపారు.

ప్రతిరోజు రోజు కళాశాలకు రావాలి

● ఇంటర్మీడియట్ అధికారి రఘురాజ్

నవతెలంగాణ-కోటగిరి


మాట్లాడుతున్న డీఐఈవో రఘురాజ్

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు ప్రవేశపెడుతుందని, వారి ఉన్నతికి ఎక్కడా లేని విధంగా ఖర్చు చేస్తుందని ఇంటర్మీడియట్ అధికారి రఘురాజ్ అన్నారు. బుధవారం కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. నూతనంగా ఇంగ్లీష్ ల్యాబ్ ప్రవేశ పెట్టామని, ఉచితంగా పుస్తకాలు అందజేస్తుందని అర్హత కలిగిన అధ్యాపకులతో విద్యను బోధిస్తున్నారని విద్యార్థులు ప్రతిరోజు కళాశాలకు వచ్చి చదువుకోవాలని పేర్కొన్నారు.

మంబోజిపేటలో మోతి బిందు శిబిరం

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని మంబోజిపేట్ గ్రామపంచాయతీలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో సర్పంచ్ గుర్రపు స్వప్న చంద్రయ్య చేతుల మీదుగా బుధవారం మోతి బిందు శిబిరం నిర్వహించినట్టు కంటి వైద్య అధికారి హరికిషన్ తెలిపారు. 13 మందికి మోతి బిందు గుర్తించి వారిని కంటి పరీక్షల నిమిత్తం లయన్స్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అదే విధంగా 28 మందికి దృష్టిలోపాన్ని గుర్తించి కంటి అద్దాలకు రిఫర్ చేయనున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గుర్రపు స్వప్న చంద్రయ్య, ఇంటి వైద్య సిబ్బంది సుమలత, పంచాయతీ కార్యదర్శి పవన్ కుమార్, ఆశావర్కర్లు సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగిగా శ్రీనివాసరావు

నవతెలంగాణ-ఎడపల్లి

నిజామాబాద్ జిల్లా నీటిపారుదల శాఖలోని నిజామాబాద్ డివిజన్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆర్.శ్రీనివాస్ రావు ఉత్తమ ఉద్యోగిగా ఎంపికయ్యారు. నిజామాబాద్ నగరంలోని పోలీసు పరేడ్ మైదానంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర రోడ్ల భవనాల శాఖ మంత్రి ప్రశాంత్ రెడ్డి చేతుల మీదుగా ఆయన అవార్డుతో పాటు, ప్రశంసపత్రం అందుకున్నారు. ఎడపల్లి మండలం జానకంపేట్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ రావుకు ఉత్తమ ఉద్యోగి అవార్డు రావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. నీటిపారుదల శాఖలో సహెూద్యోగి ఉత్తమ ఉద్యోగిగా ఎంపిక కావడం పట్ల శాఖ ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేశారు.

బోధన్‌లో ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కాలేజీలను నిర్మించండి

● ఎమ్మెల్సీ కవితకు విద్యార్థి సంఘాల వినతి

నవతెలంగాణ-బోధన్‌టౌన్

బోధన్‌లో ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కాలేజీలను నిర్మించాలని ఎమ్మెల్సీ కవితకు ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్‌బీ బోధన్ డివిజన్ కమిటీల బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ బోధన్ డివిజన్ కార్యదర్శి సాయికుమార్ మాట్లాడుతూ.. బోధన్ పట్టణంలో ఐటీఐ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాలలను ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఉన్నత విద్యను చదవడం కోసం ఈ ప్రాంతం విద్యార్థులు హైదరాబాద్‌కు తరలివెళుతున్నారని, బోధన్ పట్టణాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చడం కోసం ఎమ్మెల్సీ కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌బీ జిల్లా అధ్యక్షులు నాగరాజు, రాజు నాయకులు పాల్గొన్నారు.

సలాబత్‌పూర్ ఆలయానికి పోటెత్తిన భక్తులు

● నెలరోజుల సప్త ముగింపు

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని సలాబత్పూర్ ఆంజనేయ స్వామి ఆలయానికి బుధవారం మూడు రాష్ట్రాల భక్తులు పోటేత్తారు. ఈ ఆలయంలో అధిక మాసం సందర్భంగా నెల రోజుల నుంచి సప్త భజన కీర్తన ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా బుధవారం ఈ ఆలయంలో నెల రోజులుగా నిర్వహించిన సప్త కార్యక్రమం ముగిసింది. ముగింపు రోజున భక్తుల కోసం మద్నూర్ మండలంలోని పెద్దశక్కర్గ గ్రామ ఎంపీటీసీ అనూషబాయి కుమారుడు కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు రామ్ పటేల్ ఆధ్వర్యంలో వందల సంఖ్యలో తరలివచ్చిన భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించిన రామ్ పటేల్ కు ఆలయ కమిటీ సభ్యులు ఆలయ అధికారులు సన్మానించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నర్సింలు గౌడ్, సలాబత్పూర్ సర్పంచ్ షేక్ గఫర్, ఎంపీటీసీ సభ్యులు విజయ్, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆలయ అధికారులు పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-వర్ని

కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ(ఎం) ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ డిమాండ్ చేశారు. బుధవారం కార్మికుల సమస్యలపై ఆయన ప్రధానికి లేఖ రాశారు. ఏఎన్ఎం, అంగన్‌వాడీ, ఆశా, గ్రామపంచాయతీ, క్యాజువల్, గెస్ట్ ఫ్యాకల్టీ, కాంట్రాక్టు లెక్చరర్స్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వాలను సమన్వయం చేసి, సమస్య పరిష్కరించాలని లేఖలో పేర్కొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని ఉత్తునూరు గ్రామంలో జాతీయ పశువ్యాధుల నివారణలో భాగంగా పశువులకు గాలికుంటు నిరోధక వ్యాధి నిరోధక టీకా లను విజయ డెయిరీ ఆధ్వర్యంలో బుధవారం వేశారు. కార్యక్రమంలో విజయ డెయిరీ అధ్యక్షులు దొడ్ల నరేందర్, రావు, సర్పంచ్ మోతె సాయవ్వ రాములు, ఉప సర్పంచ్ కాత్మండి శివ, పశువైద్యాధికారి కిషోర్, బీఎంసీయూ ఇంచార్జ్ సంజీవ్, గోపాలమిత్రలు కాశిరెడ్డి, మురళి, పాడి రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

వంద రోజుల్లో ఫ్యాక్టరీ తెరిపిస్తానన్న హామీ ఏమైంది..?

నవతెలంగాణ-రెంజల్

బోధన్ బహిరంగ సభలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత గత తొమ్మిది సంవత్సరాల కిందట తమ పార్టీ అధికారంలోకి వస్తే ఎన్ఎస్ఎఫ్ ఫ్యాక్టరీ తెరిపిస్తానని ఇచ్చిన హామీ ఏమైందని రెంజల్ బీజేపీ నాయకులు ప్రశ్నించారు. బుధవారం సాటాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మండల అధ్యక్షులు మేక సంతోష్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ మహిళలను బహిరంగ సభకు తరలించడానికి నాన అవస్థలు పడాల్సి వచ్చిందని వారన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షులు గోపికృష్ణ, సోషల్ మీడియా బోధన్ డివిజన్ సాయినాథ్ పార్థ రమేష్, ప్రసాద్, యువత పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో మాజీ ప్రధాని వాజ్‌పేయి వర్ధంతి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

భారత మాజీ ప్రధాని భారతీయ జనతా పార్టీ నాయకులు భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా మండలంలోని బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు. ఆయన ప్రధానిగా దేశానికి చేసిన సేవను స్మరించుకున్నారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బాలకిషన్, మండల ప్రధాన కార్యదర్శి కురుమ సాయిబాబా, బీజేవైఎం మండలాధ్యక్షులు నరేష్ పీకే, ఉపాధ్యక్షులు ప్రశాంత్, లక్ష్మణ్ నాయక్, బీజేపీ సీనియర్ నాయకులు మ్యాథరి సాయిలు, సత్యం, గణేష్, యాదగిరి పాల్గొన్నారు.

పప్పు ధాన్యాలసాగు లాభదాయకం

● జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి

నవతెలంగాణ-మద్నూర్/బిచ్కుంద


పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారిణి

పప్పు ధాన్యాల సాగు చేస్తే లాభదాయకం ఉంటుందని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలో సాగు చేసిన పలు పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ.. ఏఈఓలు రైతులకు అందుబాటులో ఉండి సాగు చేస్తున్న పంటలను ఎప్పటి కప్పుడు సర్వే నంబర్ వారీగా నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా ఆధునిక పద్ధతిలో సాగు అధిక దిగుబడినిచ్చే సోయా పంటలో కంది సాగు చేస్తున్న రైతు పాకల్వార్ రమేష్ పొలాన్ని సందర్శించి తగు సూచనలు చేశారు. మండల వ్యవసాయ అధికారి రాజు, మద్నూర్ సర్పంచ్ సురేష్, ఏఈఓలు ప్రియాంక, అనిల్, శ్రీలేఖ, రైతులు రమేష్, రాజేష్ పాల్గొన్నారు.

20వ తేదీలోపు వ్యవసాయ గణన పూర్తి చేయాలి..

బిచ్కుంద : 11వ వ్యవసాయ గణన ఏఈవోలు, ఏవోలు క్షేత్రస్థాయిలో పగడ్బందీగా సర్వే నిర్వహించి ఈనెల 20వ తేదీలోపు పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారిని భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం బిచ్కుంద మండలంలోని దడ్గీ చౌరస్తాలో ఏఈవోలు, ఏవోలతో రైతు వేదికలో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా వ్యవసాయ అధికారిని మాట్లాడుతూ వ్యవసాయ గణన వలన సామాజిక వర్గం, స్త్రీ, పురుషులు, వ్యవసాయ సాగు విధానం, ప్రభుత్వం ద్వారా చేపట్టబోయే వ్యవసాయ అభివృద్ధికి ఈ సామాజిక వ్యవసాయ గణన ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ నెల 8వ తేదీన జిల్లా కేంద్రంలో వ్యవసాయ అధికారులకు వ్యవసాయ గణనపై శిక్షణ తరగతులు నిర్వహిస్తామని ఎవరికైనా ఎలాంటి సందేహాలున్నా తమ వద్ద నివృతి చేసుకోవాలని అన్నారు. ఏడు మండలాల్లో జరుగుతున్న వ్యవసాయ గణన పనితీరుపై జిల్లా వ్యవసాయ అధికారిని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ రాజారాం, డిప్యూటీ ఎస్ఓలు రాజారాం, లక్ష్మణ్, ఏడీఏ నూతన్ కుమార్, వ్యవసాయ అధికారి పోచయ్య, ఏడు మండలాల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, ఎంపీఏస్వోలు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు సరికాదు

● అఖిలపక్ష పార్టీ నాయకులు

నవతెలంగాణ-బోధన్‌టౌన్


మాట్లాడుతున్న నాయకులు

ముందస్తు అరెస్టులు సరికాదని పలువురు నాయకులు అన్నారు. బీఆర్ఎస్ పార్టీ బోధన్ నియోజకవర్గ బూత్ కమిటీ మీటింగ్ సందర్భంగా పోలీసులు అఖిలపక్ష పార్టీల నాయకుల్ని మంగళవారం అర్ధరాత్రి నుంచి అరెస్టులు చేసి బోధన్ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) బోధన్ నియోజకవర్గ కార్యదర్శి ఏశాల గంగాధర్, బోధన్ నియోజకవర్గం కార్యదర్శివర్గ సభ్యులు జమ్మిశెట్టి శంకర్‌గౌడ్, సీపీఐఎంఎల్ బోధన్ నియోజకవర్గ కార్యదర్శి బండారి మల్లేష్, సీపీఐ ఎంఎల్ పార్టీ పుట్ట వరదయ్య, సీపీఐఎంఎల్ పార్టీ బోధన్ నియోజకవర్గం నాయకులు దమల్యాపూర్ పోశెట్టి మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తే.. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికార మంద బలంతో ప్రశ్నించే వారిని అరెస్టు చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రజాసమస్యల పరిష్కారం పట్ల శ్రద్ధ చూపాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు బాలరాజు, జిల్లా నాయకులు శ్రీనివాస్, యేశాల సురేందర్, శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కౌన్సిలర్ హనుమంతరావు, సాయిలు, నవీన్, మొయినుద్దీన్, ఖరీం, అబ్దుల్ రజాక్, గంగాధర్, మహేష్, రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

● తెలంగాణ జన సమితి డా.నిజ్జన రమేష్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి


మాట్లాడుతున్న నిజ్జన రమేష్

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని తెలంగాణ జన సమితి డా.నిజ్జన రమేష్ అన్నారు. బుధవారం మండలంలోని అన్నసాగర్ గ్రామంలో రైతులతో టీజేఎస్ నాయకులు నిజ్జన రమేష్ మాట్లాడారు. ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యే జాజాల సురేందర్ పోచారం డ్యామ్ ఎత్తు పెంచి రైతులకు సాగు నీరు అందించకుండా మోసం చేశారని ఆరోపించారు. నియోజకవర్గ పరిధిలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందించాలన్నారు. సదాశివనగర్ మండలం భూంపల్లి గ్రామం దగ్గర పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని ఏ గ్రామ రైతులకు కూడా అన్యాయం జరగకుండా సాగునీరు అందరికి అందించాలన్నారు. గెలిచిన నాయకులు సొంత ఆస్తులపై దృష్టి పెట్టారు తప్ప నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేసిన పరిస్థితి లేదని అన్నారు. ఇప్పుడున్న పరిస్థితిలో ఎల్లారెడ్డి నియోజకవర్గానికి కావాల్సింది ఒక విజన్‌తో పని చేసే నాయకులు కావాలన్నారు. రైతులు రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేకు గుణపాఠం చెప్పాలన్నారు. కొంత మంది నాయకులు అయితే పదవుల కోసమే పార్టీలు మారుతున్నారని, అభివృద్ధి కోసం కాదని తెలిపారు. టీజేఎస్ పార్టీ జిల్లా నాయకులు లక్ష్మణ్, పూల్‌సింగ్, చాకలి కుమార్ రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గ్లాసులు పంపిణీ

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని ధర్మరావుపేట ప్రాథమిక పాఠశాల 182 మంది విద్యార్థులకు రాగి జావా కొరకు స్టీల్ గ్లాసులను దాత దాసారం సాయిబాబా బుధవారం పంపిణీ చేశారు. ఆయనకు పాఠశాల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్.సదాశివ్, పాఠశాల డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ దాసారం బలరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహాసభకు తరలివెళ్ళిన ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-రెంజల్

పట్టణంలోని ఎన్ఎస్ఎఫ్ ఫ్యాక్టరీ ఆవరణలో నిర్వహించిన బీఆర్ఎస్ మహాసభకు రెంజల్ మండలంలోని సాటాపూర్ గ్రామం నుంచి మూడు బస్సులలో స్థానిక సర్పంచ్ వికార్‌పాషా, ఎంపీటీసీ ఎస్కే అహ్మద్ ఆధ్వర్యంలో ప్రజలు తరలి వెళ్లారు. కార్యక్రమంలో స్థానిక గ్రామ కమిటీ అధ్యక్షులు భూమేష్, మండల ఉపాధ్యక్షులు హాజీ ఖాన్, కె.సాయిలు, ప్రేమ్‌కుమార్, మహేష్, మహిళలు పాల్గొన్నారు.

బోర్గం నుంచి తరలివెళ్లిన బీఆర్ఎస్ నాయకులు..

పట్టణంలోని శక్కర్‌నగర్ ఎన్ఎస్ఎఫ్ ఫ్యాక్టరీ ఆవరణలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు బోర్గం గ్రామ ప్రజాప్రతినిధులు కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. కార్యక్రమంలో సర్పంచ్ పార్ధవాని సాయిరెడ్డి, ఉప సర్పంచ్ ఫెరోజుద్దీన్, రెంజల్ సింగిల్ విండో చైర్మన్ మొయినొద్దీన్, గ్రామ కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్, అఫ్రోజ్ బేగ్, కాసిముద్దీన్, పార్థరాజు, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

తక్కడ్‌పల్లి ప్రతిభకు 'సేవ భారత్ అవార్డ్'

నవతెలంగాణ-పిట్లం

అంతర్జాతీయ ప్రపంచ స్థాయిలో దేశానికి అనేక బంగారు పథకాలు సాధించి, అనాథ అమ్మాయిలకు స్వీయ రక్షణలో శిక్షణనిస్తూ దేశానికి సేవ చేస్తున్నందున తెలంగాణ భాష సంస్కృతిక శాఖ అండ్, ఎన్ఎండీసీ సౌజన్యంతో హెవెన్ హెూం సొసైటీ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో బుధవారం అందించిన 'సేవా భారత్ అవార్డ్స్' మండల కేంద్రానికి చెందిన తక్కడపల్లి ప్రతిభకు వరించినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని మహిళా సాధికారత, మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్నందుకు తెలంగాణ ప్రభుత్వం సేవ భారత్ అవార్డు ప్రధానం చేయడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ అవార్డును తన తల్లిదండ్రులు శ్యామల నర్సింగ్‌రావుకు అంకితం చేస్తున్నట్లు ఆమె తెలిపారు.


అవార్డు అందుకుంటున్న ప్రతిభ

బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు


విప్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలో స్థానిక హరిజనవాడ కాలనీలోకి వెళ్లే రహదారి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ రూ.కోటి 5 లక్షల నిధులు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ పట్టణ బీఆర్ఎస్ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు డప్పు రవి బుధవారం ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా రోడ్డు లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకున్న ప్రభుత్వ విప్ అడిగిన వెంటనే నిధులు కేటాయించడం పట్ల ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీ సిద్ధి రామేశ్వర ఆలయ పునర్నిర్మాణ కమిటీ డైరెక్టర్ తాటికొండ బాబు, నర్మాల రామచంద్రం, ఎంపీటీసీ ఉప్పల బాబు, వార్డు సభ్యురాలు సుజాత, సత్తూరి బాలరాజు, తాటికొండ రమేష్, స్వామి, సురేష్, పెద్ద ఎత్తున దళిత నాయకులు పాల్గొన్నారు.

జాస్ కమిటీపై శిక్షణ


మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో చంద్రశేఖర్

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని రైతు వేదికలో జన ఆరోగ్య సమితి ఏర్పాటుపై డిప్యూటీ డి.ఎం.యచ్.ఓ శిరీష బుధవారం శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ డి.యం.యచ్.ఓ.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. మనం చేసిన పనికి గుర్తింపు ఉండాలని అన్నారు. జాస్ కమిటీలో క్రమ శిక్షణతో పనిచేసినప్పుడే విలువ ఉంటుందని కొనియాడారు. ఈ కమిటీలో అందరినీ భాగస్వాములు చేయాలని సూచించారు. ప్రతీ గ్రామాన్ని ఆరోగ్య గ్రామంగా తయారు చేయాలని అన్నారు. సర్పంచ్ బద్దం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. కరోనా సమయంలో డాక్టర్లు, ఆశ కార్యకర్తలు ప్రాణాలను పనంగా పెట్టి పనిచేశారని గుర్తు చేస్తూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మర్కల్ సర్పంచ్ జూకంటి సంగారెడ్డి మాట్లాడుతూ.. ఆశకార్యకర్తలను రెగ్యులర్ చేయాలని కోరారు. గతంలో కంటే ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రి మంచి సేవలు అందిస్తున్నారని సర్పంచ్ కొనియాడారు. ప్రజల సౌకర్యం కోసమే పల్లె దవాఖానలు ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎం.పి.పి.గైని అనుసూయ, డాక్టర్ ఆస్మా అఫ్రిన్, సర్పంచ్‌లు బదాల భాస్కర్‌రెడ్డి, బాలకృష్ణ, రాజమణి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వడ్ల రాజేందర్, సి.యచ్.ఓ నాగరాజు, ఎ.ఎస్.యంలు, అంగన్వాడీ టీచర్లు, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అటల్ బిహారీ వాజ్ పేయికి ఘన నివాళి

నవతెలంగాణ-నవీపేట్

బిజెపి పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మాట్లాడుతూ.. అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానమంత్రిగా చేసిన సేవలు ప్రజలు ఎన్నటికీ మర్చిపోలేరని అన్నారు. ఆయన జీవితం ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో బందెల ఆనంద్, రామకష్ణ, పిల్లి శ్రీకాంత్, రాజేందర్ గౌడ్, రాము, బాల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన

నవతెలంగాణ-జుక్రాన్‌పల్లి

వర్షాకాలం వచ్చే వ్యాధులపై విద్యార్థులకు మండల ఆయుర్వేదిక డాక్టర్ లలిత అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని పాఠశాలలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులు, వాటి నివారణా గురించి పిల్లలకు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాస్, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు సుధాకర్, పాఠశాల బందం పాల్గొన్నారు .



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ లలిత

బిల్లులు మంజూరు చేయండి

- తహసీల్దార్‌కు వినతి



వినతిపత్రాన్ని అందజేస్తున్న బీజేపీ నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

కల్లెడ గ్రామానికి చెందిన లావణ్య ప్రసాద్ గౌడ్ చేసిన అభివద్ధి పనుల బిల్లులు మంజూరు చేయాలని బీజేపీ నాయకులు ఆలూర్ తహసీల్దార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామఅభివృద్ధి పనులకు 30 లక్షల వరకు సొంతంగా ఖర్చుపెట్టారని అన్నారు. ఇంతవరకు బిల్లులు రాకపోవడనికి స్థానిక ప్రజాప్రతినిధి కక్ష్య సాధింపు చర్యలు కారణం అని అప్పుల బాధతో సర్పంచ్ లావణ్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు గిరీష్, మల్లయ్య మహేష్, హరీష్, ప్రళయ్ తేజ్, సురేష్ గౌడ్, రాజారెడ్డి, శ్రీనివాస్, నర్సారెడ్డి, సుభాష్, నాగరాజు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ



తూము శివమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ

నవతెలంగాణ-నవీపేట్

తూము శివమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని మోకన్‌పల్లి గ్రామంలో నిరుపేదలకు నిత్యావసర సరుకులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ శరత్ రెడ్డి మాట్లాడుతూ ట్రస్టు ద్వారా బోధన్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో నిరుపేదలను గుర్తించి నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మరెన్నో సేవా కార్యక్రమాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రొడ్డ సుధాకర్, మున్సిపల్ చైర్మన్ పద్మ శరత్ రెడ్డి,ఉపసర్పంచ్ సురేష్, గ్రామ పెద్దలు మరియు ప్రజలు పాల్గొన్నారు.

మధుయాష్కిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



మధుయాష్కినితో కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-మోపాల్

మండల్ కాంగ్రెస్ నాయకులైన నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు, నిజామాబాద్ మాజీ ఎంపీపీ యాదగిరి, మండల మాజీ అధ్యక్షుడు బున్ని రవి మధు యాష్కి గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం నిజామాబాద్‌లో జరిగిన బీసీ డిక్లరేషన్ సమావేశంలో ఆయన్ను కలిశారు. ఈసందర్భంగా యాదగిరి మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురుతుందని, నియోజకవర్గంలోని కార్యకర్తలు అందరం కూడా ఒక సైనికుల్లాగా పని చేస్తామని తెలిపారు. బున్ని రవి మాట్లాడుతూ.. వచ్చే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు.

అందుబాటులో ఉండి సేవలందించాలి

- ఎంపీపీ అధ్యక్షురాలు లోలపు గౌతమి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు ఉత్తమ సేవలు అందించాలని ఎంపీపీ అధ్యక్షరాలు లోలపు గౌతమి అన్నారు. బుధవారం మండలంలోని చౌట్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపీపీ అధ్యక్షతన ఆస్పత్రి అభివద్ధి సలహా సంఘం సమావేశాన్ని నిర్వహించారు. రోగులకు అందుతున్న సేవలపై చర్చించారు. ఆస్పత్రి సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండి బాధ్యతగా రోగులకు నాణ్యమైన సేవలు అందించాలన్నారు. మాత శిశు సంరక్షణ సేవలు, ప్రసవాలను పెంచాలని సిబ్బందికి సూచించారు. ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు గ్రామాల్లో గర్భిణీలకు ప్రభుత్వ ఆస్పత్రిలోనే పసవం చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం చేయించుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న సేవలపై వైద్యురాలు డాక్టర్ సుప్రియ సమావేశంలో వివరించారు. ఈ సమావేశంలో సర్పంచ్ మారు శంకర్, ఆరోగ్య విస్తీర్ణ అధికారి సత్యనారాయణ, రైతుబంధు సమితి గ్రామ కో ఆర్డినేటర్ రాజేందర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నవీన్ గౌడ్, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పొతంగల్ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-గాంధారి



కాంగ్రెస్ పార్టీ మైనారిటీ ఎన్నిక

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎల్లారెడ్డి నియోజవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి ఆదేశానుసారం గాంధారి మండల పరిధిలోని పెద్ద పొతంగల్ కలాన్ మైనారిటీ కమిటీని సయ్యద్ బషీర్ గాంధారి మండల మైనారిటీ అధ్యక్షుల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. పొతంగల్ గ్రామ అధ్యక్షులుగా షేక్ మోయిన్, ఉపాధ్యక్షులుగా షేక్ సోయల్, ప్రధాన కార్యదర్శిగా షేక్ నసీరుద్దీన్ ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మైనారిటీ మండల ఉపాధ్యక్షుల షేక్ అజ్మత్, కె.తుకారాం పంతులు, షేక్ జయినుద్దీన్, కళ్యాణ్, జి.ప్రవీణ్, షేక్ మహబూబ్, ఎండీ ఆరిఫ్, ఎండీ అక్బర్, ఎండీ ఫిర్దోస్ అర్షద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోటీపరీక్షల పుస్తకాల వివరాలను అందించండి

- టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి
- లైబ్రరీ, హెల్త్‌సెంటర్, పరీక్ష కేంద్రాలు తనిఖీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

విద్యార్థులకు పోటీ పరీక్షల కోసం కావలసిన పుస్తకాల వివరాలను త్వరలో అందజేసే విధంగా చూడాలని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం యాదగిరి సూచించారు. బుదవారం యూనివర్సిటీ లోని సెంట్రల్ లైబ్రరీ నుంచి పరిశీలించారు. కాంపిటీటివ్ పుస్తకాల వివరాలను అడిగి తెలుసుకుని, కావలసిన కొత్త పుస్తకాలకు ఇండెంట్ పంపించి సత్వరమే పుస్తకాలను అందుబాటులోకి తీసుకురావాలని లైబ్రేరియన్ డాక్టర్ సత్యనారాయణను రిజిస్ట్రార్ ఆదేశించారు. యూనివర్సిటీ ఇంచార్జీ వైస్ ఛాన్సలర్ వాకాటి కరుణ సెంట్రల్ లైబ్రరీ వసతులు, అవసరమైన పుస్తకాల గురించి ఇప్పటికే చర్చించారని అన్నారు. ఎంత మొత్తం అవసరం ఉన్నా యూనివర్సిటీ ఖర్చు పెట్టడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. లైబ్రరీలో అవసరమైన వసతులను, సామాగ్రిని పెంచి విద్యార్థులలో పోటీ తత్వాన్ని పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రార్ లైబ్రేరియన్ సత్యనారాయణకు ఆదేశించారు. సందర్శనలో రిజిస్ట్రార్ తో పాటు చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ వివేక్ రాజ్ తదితరులు ఉన్నారు.




హెల్త్ సెంటర్ ఆకస్మికంగా తనిఖీ

తెలంగాణ యూనివర్సిటీలోని హెల్త్ సెంటర్‌ను యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. యాదగిరి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హెల్త్‌సెంటర్‌కు వచ్చే విద్యార్థులకు కావాలసిన టాబ్లెట్స్, సిరప్స్ అందుబాటులో ఉంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఏఎన్ఎం సుజాతను ఆదేశించారు. యూనివర్సిటీకి అందించే ఈ సౌకర్యాన్ని విద్యార్థులు ఉపయోగించుకొని రోగాల పాడిన పడకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. హెల్త్‌సెంటర్, పరిసరాలతోపాటు పడక గదులను, బెడ్స్‌ను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచే విధంగా చూడాలని సూచించారు. హెల్త్ సెంటర్‌లోని అత్యాధునిక పరిజ్ఞాన మిషన్లను వినియోగంలోకి తీసుకురావాలని, వాటిని ఎప్పటికప్పుడు జాగ్రత్తగా చూసుకుంటూ శుభ్రపరచాలని అటెండర్ లకు ఆదేశాలు ఇచ్చారు. ఫినాయిల్ని వాడి గదులను శుభ్రం చేయాలని హెల్త్ సెంటర్ ఏఎన్ఎం సుజాతకు అందేశించారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

తెలంగాణ యూనివర్సిటీ లోని రెగ్యులర్ బ్యాక్లాగ్ పీజీ, బీఈడీ పరీక్ష కేంద్రాన్ని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం యాదగిరి ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. తెలంగాణ యూనివర్సిటీ లో బుధవారం ఉదయం జరిగిన పీజీ 03వ సెమిస్టర్, 06వ సెమిస్టర్, బీఈడీ రెగ్యులర్ సెమిస్టర్ , బ్యాక్ లాగ్ సెమిస్టర్ పరీక్షలు కొనసాగాయి. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలకుండా చూడాలని విధులలో ఉన్న ఇన్విజిలేటర్లకు సూచించారు. పరీక్షలు పారదర్శకంగా,పకడ్బందీగా నిర్వహించి యూనివర్సిటీ కీ మంచి గుర్తింపు తీసుకురావాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం యాదగిరి అభిప్రాయపడ్డారు.రిజిస్ట్రార్ తో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ సిహెచ్ హారతి, వైస్ ప్రిన్సిపాల్ మావురపు సత్యనారాయణ, డా"రవీందర్ రెడ్డి తదితర అధ్యాపకులు ఈ తనిఖీ లో పాల్గొన్నారు.పీజీ రెండవ సెమిస్టర్, బ్యాక్ లాక్ పరీక్షలకు 2001 మంది నమోదు కాగా 1831 హాజరు కాగా 170 మంది గైరాజరైరయ్యారు. పీజీ నాలుగవ రెగ్యులర్, సెమిస్టర్ బ్యాక్ లాక్ పరీక్షలకు 23 ఉండగా పూర్తిస్థాయి విద్యార్థులు హాజరయ్యారు. బీఈడి సెమిస్టర్ పరీక్షలకు195 ఉండగా180 హాజరుకాగా 15 మంది గైరాజరయ్యారు. బీఈడీ రెగ్యులర్ సెమిస్టర్, బ్యాక్‌లాక్ మధ్యాహ్నం పరీక్షలకు 1324 ఉండగా 1292 హాజరయ్యారు 32 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్ ఎం అరుణ తెలిపారు.



సెంట్రల్ లైబ్రరీని పరిశీలిస్తున్న రిజిస్ట్రార్

29న కార్మికుల మహాధార్నను విజయవంతం చేయండి

- ఐఎఫ్‌టీయూ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఈ నెల 29న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న కార్మికుల మహాధర్నాను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.భూమేశ్వర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.సూర్య శివాజీ అన్నారు. తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఐయఫ్‌టియూ ఆధ్వర్యంలో నిజామాబాద్ ఎన్ఆర్ భవన్‌లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ పిలుపు మేరకు ఈ నెల 29న హైదరాబాద్‌లో కార్మికుల మహ ప్రదర్శన, ధర్నా చేపడుతున్నట్టు తెలిపారు. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చే ముందు కార్మికుల హక్కులను కాపాడుతానని పరిశ్రమలు, ఫ్యాక్టరీలు పెట్టి ఉపాధి అవకాశలు కల్పిస్తానని అనేక వాగ్దానాలు చేశారని అన్నారు. అనంతరం 44 కార్మిక చట్టాలను, నాలుగు కోడ్ లుగా విభజించి కార్మిక హక్కులను కాలరాశారన్నారు. ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు చూపెట్టకుండా కోట్పా చట్టం తేవటం అన్యాయం అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ తను అధికారంలోకొస్తే బీడీ కార్మికులందరికీ జీవనభృతి ఇస్తానని హామీ ఇచ్చి 2014 ఫిబ్రవరి 28 కటాఫ్ డేట్ నిబంధన పెట్టడంతో చాలామంది కార్మికులకు జీవనభృతి రావడంలేదన్నారు. 15 రోజుల క్రితం జీవనభృతి ఇస్తానని ప్రకటించిన ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఇంతవరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఇవ్వలేదన్నారు. బీడీ కార్మికులతోపాటు బీడీపరిశ్రమలోని మిగితా కార్మికులకు నెలసరి వేతన ఉద్యోగులకు జీవన భృతి వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బి భూమన్న, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల రాములు, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం డి ఖాజా మొయినుద్దీన్, రాష్ట్ర నిర్మాణ కార్యదర్శి జే గంగాధర్, రాష్ట్ర నాయకులు ఎం శివకుమార్, వి పద్మ, ఎం సుప్రియ, ఎం తిర్మల్, ఎల్ లక్ష్మి చిట్టక్క, ఏ.ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

బోధన్ చక్కెర కర్మగారాన్ని వెంటనే పునరుద్ధరించాలి

- బీజేపీ రాష్ట్ర నాయకులు వడ్డీ మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-ఎడపల్లి

గత ఎన్నికల్లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బోధన్ చక్కెర కర్మగారాన్ని అధికారంలోకి వచ్చిన వెంటనే వందరోజుల్లోనే తెరిపిస్తానని ఇచ్చిన హామీ హామీగానే మిగిలిపోయిందని బీజేపీ రాష్ట్ర నాయకులు వడ్డీ మోహన్ రెడ్డి ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశం నిర్వహించారు. అలాగే మాజీ ప్రధానమంత్రి అటల్ బీహార్ వాజ్‌పేయి వర్ధంతిని మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు, ఆ పార్టీ ఎడపల్లి మండల ప్రజాప్రతినిధులు వాజ్‌పేయి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు వడ్డీ మోహన్‌రెడ్డి, బోధన్ నియోజకవర్గ సీనియర్ నాయకులు మేడపాటి ప్రకాష్‌రెడ్డి, బోధన్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్, వడ్డేపల్లి సర్పంచ్, దిశ కమిటీ సభ్యులు కూరెళ్ళ శ్రీధర్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షులు, పోచారం గ్రామ సర్పంచ్ కోలా ఇంద్రకరణ్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్ కార్యకర్తల సమావేశానికి తరలిన నాయకులు

నవతెలంగాణ-బోధన్/ఎడపల్లి

బోధన్ పట్టణంలోని ఎన్ఎస్ఎఫ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న నియోజకవర్గ బూత్ కమిటీలు, కార్యకర్తల సమావేశానికి బోధన్, సాలూర మండలాల నుంచి మాజీ మండల రైతు సమితి అధ్యక్షులు బుద్దె రాజేశ్వర్ ఆధ్వర్యంలో బూత్ కమిటీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు వాహనాలలో భారీ సంఖ్యలో బోధన్‌కు తరలివెళ్లారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హాజరుకావడంతో మహిళలు వాహనాలలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా బోధన్ పట్టణం గులాబీ జెండాలతో గులాబీమయం అయ్యింది. బోధన్ తరలిన వారిలో సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్, కేజీ గంగారాం, ఐడీసీఎంఎస్ డైరెక్టర్ రాజాగౌడ్, ఏఎంసీ వైస్ చైర్మెన్ షకీల్, నాయకులు వెంకట్ పటేల్, శివకాంత్ పటేల్, సరిడే సాయిలు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి తరలిన బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ సమావేశానికి తరలిన నాయకులు

ఎడపల్లి : బోధన్ నియోజకవర్గ శాసనసభ్యులు మహమ్మద్ షకీల్ అమీర్ బోధన్ పట్టణంలో బీఆర్ఎస్ యూత్ లెవెల్ కమిటీ సమావేశం నిర్వహించడంతో ఎడపల్లి మండల ప్రజాప్రతినిధులు, నాయకులు భారీ ఎత్తున తరలివెళ్లారు. ఎడపల్లి ఎంపీపీ కే శ్రీనివాస్, జెడ్పి ఉపాధ్యక్షురాలు, ఎంపీటీసీలు పద్మ ముత్తన్న, ఆరుగుల వనజ నాగరాజు, నాయుడు స్రవంతి పోతన్న, మనిషారెడ్డి, వైస్ ఎంపీపీ ఇమ్రాన్‌ఖాన్, బిల్లా సుమలత అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు ఉచితంగా కండ్ల కలక నివారణ మందు పంపిణీ



కండ్ల కలక నివారణ మందును అందజేస్తున్న రాజ్‌కుమార్

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో రోగులకు చుక్కల మందును బుధవారం ఉచితంగా సుమారు 15 మందికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ కృష్ణమోహన్, మల్టీ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ శైలజ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు నిలయంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని ఎంఎస్‌యూ నాయకులు యాదవ్, బాలు, షిండే అన్నారు. బుధవారం కళాశాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. కళాశాలకు ప్రహరీ గోడ లేక పోవడం వల్ల కళాశాల ఆవరణలో పాములు, పశువులు వస్తున్నాయని, వీటివల్ల విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతున్నారని, అదేవిధంగా తరగతి గదులలో విద్యుత్ సదుపాయం లేదని అన్నారు. మధ్యాహ్న భోజనం సమయంలో చేతులు కడుక్కోవడానికి నీటివసతి లేదని అన్నారు.

తల్లిదండ్రుల కష్టం ఫలించింది

- ఎస్ఐ ఉద్యోగం సాధించిన కొడుకు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



కుటుంబ సభ్యులతో అజయ్



తండ్రి మూడ్ లచ్చిరాం పొలం పని, కూలీ పని, బాయి కాడ బోర్లు తీసే పనికి చేస్తాడు. తల్లి నిర్మల మార్కెట్లో కూరగాయలమ్మి, పొలం పనికి వెళ్తుంది. వారికి ఉన్న రెండు ఎకరాల పొలం సాగు చేసుకుంటారు. వీరి కొడుకు అతిచిన్న వయసులోనే ఎస్ఐ ఉద్యోగం సాధించాడు. తల్లిదండ్రుల కష్టానికి ఫలితాన్ని ఇచ్చాడు. అజయ్‌ది మోపాల్ మండలం మంచిప్ప గ్రామంలోని బైరాపూర్ తండా. అజయ్‌కు విద్యలో ఎటువంటి ఆటంకం కలిగించకుండా మంచి చదువును అందించి ఉద్యోగం సంపాదించే దిశగా కుటుంబ సభ్యులు సహకారం అందించారు. అజయ్ మాక్లూర్ మండలం ప్రభుత్వ బీసీ బాయ్స్ హాస్టల్‌లో ఉంటూనే ప్రైవేటు పాఠశాల శ్రీవాణి నవోదయ స్కూల్‌లో ఒకటి నుంచి ఏడవ తరగతి వరకు, సరస్వతి నవోదయ స్కూల్‌లో తొమ్మిది, పదో తరగతి పూర్తి చేశాడు. ఇంటర్ ఎస్ఆర్ కాలేజీ నిజామాబాద్‌లో పూర్తి చేసిన తర్వాత కాకతీయ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బీఎస్సీ (ఎంపీసీఎస్) డిగ్రీ 2019 లో పూర్తి చేశాడు. అనంతరం జాబ్ సంపాదించాలనే ఉద్దేశంతో హైదరాబాద్ వెళ్లాడు. 2021నుండి ఉద్యోగం సంపాదించే వరకు పోటీ పరీక్షలు రాస్తూనే ఉన్నాడు. గత మే నెలలో రైల్వే డిపార్ట్మెంట్లో గ్రూప్-డి లో ట్రాక్ మెయింటెనెన్స్ ఉద్యోగం వచ్చింది. తర్వాత మొన్న వచ్చిన ఎస్ఐ ఫలితాలలో బాసర జోన్ లో టాప్ 3వ ర్యాంకు సాధించారు.

త్రిపుల్ ఐటీ విద్యార్థిని మృతి

నవతెలంగాణ-రాజంపేట్

మండలంలోని ఆరేపల్లి గ్రామానికి చెందిన అంకం నేహ శ్రీ (21) త్రిబుల్ ఐటీ విద్యార్థిని బుధవారం అనారోగ్య సమస్యతో చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతి చెందింది. నేహ శ్రీ ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం చదువుతోంది. విద్యార్థిని నేహా చదువులో ముందంజలో ఉండేదని గ్రామంలో అందరితో కలివిడిగా ఉంటూ కలిసిపోయేదని గ్రామస్తులు తెలిపారు.

పాఠశాలకు ఆట వస్తువులు వితరణ

నవతెలంగాణ-రాజంపేట్



విద్యార్థులకు ఆట వస్తువుల వితరణ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

మండలంలోని తలమడ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు గ్రీన్ కో సోలార్ పవర్ ప్లాంట్ యాజమాన్యం ఆట వస్తువులు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా గ్రీన్ కో సంస్థ ప్రతినిధి రవిచంద్ర మాట్లాడుతూ.. విద్యార్థులు ఆటల్లో ముందు స్థాయిలో నిలబడి మండల, జిల్లాస్థాయిలో పాఠశాలకు గుర్తింపు తెచ్చే విధంగా ఉండడానికి ఆట వస్తువులు పంపిణీ చేస్తున్నట్టు ఆయన తెలిపారు ఇందులో భాగంగా వాలీబాల్ సెట్స్ 3, క్యారం బోర్డు 2, టెన్నికాయిట్ 4, చెస్ 3, షార్ట్‌పుట్ 4, షటిల్ బ్యాట్స్ 6 అందజేశారు. సర్పంచ్ యాదవరెడ్డి, ఎంపీటీసీ రాజు, ఎస్ఎంసీ చైర్మన్ స్వామి, శ్రీనివాస్‌గౌడ్, ప్రధానోపాధ్యాయులు అంజల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

నవతెలంగాణ-లింగంపేట్



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాల సజ్జన్‌పల్లిలో రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు దామోదర్ తెలిపారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ క్రాంతికుమార్, డాక్టర్ నిఖత్ మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించి, మంచి ఆహారం తీసుకోవాలన్నారు. తద్వారా చాలా వ్యాధులకు దూరంగా ఉండవచ్చునన్నారు. విద్యార్థులను పరీక్షించిన అనంతరం అవసరమైన మందులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దామోదర్, ఎస్.ఎం.సి చైర్మన్ సిద్దిరాములు, ఫార్మసిస్ట్ ఉమారాణి, ఎ.ఎన్.ఎం స్వప్న, ఉపాధ్యాయులు బస్సీ, జాకిర్, కవిత, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ సమ్మయ్యకు సన్మానం



సమ్మయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-బోధన్ టౌన్

అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ సమ్మయ్య మంగళవారం స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా ఉత్తమ ప్రశంసాపత్రం పొందినందుకు గానూ ఎమ్మెల్యే షకీల్ బుధవారం తన నివాసంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ పల్నాటి సమ్మయ్యను శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వాసే సెట్, న్యాయవాది మజీద్ తదితరులు పాల్గొన్నారు.